క్లుప్తంగా

కూటమి ఒప్పందాలను విస్మరించారు

మంత్రాలయం: టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి ఉమ్మడి కూటమి ఒప్పందాలను విస్మరిస్తున్నారని బీజేపీ నియోజకవర్గ నాయకుడు, హైకోర్టు న్యాయమూర్తి పురుషోత్తం రెడ్డి ఆరోపించారు. గురువారం కల్లుదేవకుంటలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాఘవేంద్ర రెడ్డి తమను పట్టించుకోవడం లేదని, ప్రచారాలకు గానీ, ఇతర కార్యక్రమాలకు గానూ తమను పిలవడం లేదని అన్నారు. తమ పార్టీ తరఫున కోసిగికి చెందిన ఆరేకంటి రాముడిని అభ్యర్థిగా బరిలో నిలబెడుతున్నట్లు తెలిపారు.

స్వామి దర్శనానికి తరలివచ్చిన భక్తులు



పూజలందుకుంటున్న ఖాదర్‌లింగస్వామి

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఫాతెహాలు, ప్రార్థనల్ని జరుపుకున్నారు. తెల్లవారుజామున 5 గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధంతో పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు.

నామినేషన్ దాఖలు

ఆదోని టౌన్: బీఎస్పీ అభ్యర్థిగా ఆసియాబాను ఆష్లీవాలే గురువారం నామినేషన్ వేశారు. ఆదోని అసెంబ్లీ అభ్యర్థిగా తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివనారాయణశర్మకు అందజేశారు.

విద్యార్థినికి సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న ఎంఈఓలు

కౌతాళం: స్థానిక ప్రతిభ హైస్కూల్ విద్యార్థిని సిరి నవోదయ స్కూల్‌కు ఎంపికైంది. విద్యార్థినిని గురువారం ఎంఈఓలు వరప్రసాద్, శోభరాణి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ దూద్‌బాషా, సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్, పర్యవేక్షకుడు భీమేష్ పాల్గొన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

హొళగుంద: మండల కేంద్రానికి చెందిన మంజుల (47) అనే మహిళ బళ్లారి ఓపీడీలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు తెలిపారు. సదరు మహిళ ఈ నెల 11న కుటుంబ కలహాల కారణంగా నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం బళ్లారి ఓపీడీకి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. మృతురాలు ఇచ్చిన మరణ వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బంగారు నగలు చోరీ

ఆదోని అర్బన్: మండలంలోని నెట్టేకల్ గ్రామానికి చెందిన సుజాత, భాస్కర్‌రెడ్డి దంపతుల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. బాధితులు తెలిపిన వివరాలు.. నెట్టేకల్ గ్రామం నుంచి దేవనకొండకు వెళ్లేందుకు ఆదోని బస్టాండుకు చేరుకున్నారు. బస్సు సమయానికి లేకపోవడంతో ఆటో ఎక్కారు. వారితో పాటు మరో ఇద్దరు మహిళలు ఆటో ఎక్కి విరుపాపురం గ్రామంలో దిగిపోయారు. ఆటో ఆస్పరికి చేరుకున్నాక సుజాత, భాస్కర్‌రెడ్డి తమ బ్యాగును సరిచూసుకోగా చిరిగిపోయి ఉండటం, అందులోని మూడున్నర తులాల బంగారం లేకపోవడంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

గాయపడిన మహిళ మృతి



షేక్ ఫిర్దోస్ మృతదేహం

గూడూరు: గూడూరు సమీపంలో ఈ నెల 15వ తేదీ ఆటో బోల్తా పడి గాయపడిన షేక్ ఫిర్దోస్ (43) అనే మహిళ కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఎస్‌ఐ హనుమంతప్ప తెలిపారు. మృతురాలు కొన్నేళ్లుగా భర్తకు దూరంగా గూడూరులో ఉంటున్నట్లు చెప్పారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమలకాల్వ గ్రామానికి చెందిన 11ఏళ్ల బాలిక అదృశ్యమైనట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటరమణ కుమార్తెకు మానసిక స్థితి సరిగాలేదు. బుధవారం ఆమె కనిపించకపోవడంతో తల్లిదండ్రులు అంతటా వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున వివరించారు.

నాన్‌లోకల్ నాయకులను నమ్మొద్దు

- మరోసారి వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టండి
- ఆదోని ఎమ్మెల్యే అభ్యర్థి సాయిప్రసాద్‌రెడ్డి



దిబ్బనకల్‌లో ప్రచారరథంపై నుంచి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: మాయ మాటలు చెబుతూ ఓటేయాలని వచ్చే నాన్‌లోకల్ నాయకులను నమ్మొద్దని ఆదోని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వై సాయిప్రసాద్‌రెడ్డి ప్రజలకు సూచించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. గురువారం మండలంలోని దిబ్బనకల్, సలకలకొండ, బసరకోడు, అలసందగుత్తి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయా గ్రామాల్లో సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తనకు 100 ఎకరాల భూమి ఉందని, అక్రమంగా, అవినీతితో సంపాదించానని ఉమ్మడి కూటమి అభ్యర్థి పార్థసారథి ప్రచారం చేస్తున్నాడన్నారు. దమ్ముంటే వంద ఎకరాల భూమి ఉన్నట్లు నిరూపిస్తే రాజకీయాలకు స్వస్తి పలుకుతానన్నారు. చిత్తూరు జిల్లా నుంచి వలసపక్షిలాగా ఆదోనికి వచ్చి లేనిపోని ఆరోపణలు చేస్తూ కుల రాజకీయాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తే నమ్మేస్థితిలో ఎవరూ లేరన్నారు. తాను చేసిన అభివృద్ధి చూసే మూడుసార్లు ఆదోని ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించుకున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ఆదోని ప్రజలకు తాను చేసిన సేవలను గుర్తించి మరోసారి భారీ మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదన్, పార్టీ నియోజకవర్గ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గోపాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్, నాయకులు గురునాథ్‌రెడ్డి, రామలింగేశ్వరయాదవ్, గోవర్ధన్‌రెడ్డి, మునీర్, వీరారెడ్డి, రైల్వే ఈరన్న, మల్లికార్జున, రంగన్న, హనుమంతు పాల్గొన్నారు.

బీవై రామయ్యను పార్లమెంట్‌కు పంపుదాం

మండలంలోని సలకలకొండ గ్రామంలో సాయిప్రసాద్‌రెడ్డి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీవై రామయ్య బీసీ నేతగా జిల్లాలో మంచి పేరుందన్నారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి తనను అసెంబ్లీకి, బీవై రామయ్యను పార్లమెంట్‌కు పంపాలని ప్రజలను కోరారు.

→ **ఆదోని టౌన్:** పట్టణంలోని వాల్మీకినగర్, బోయగేరి, వాల్మీకిమహర్షి ఏరియా ప్రాంతాల్లో సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్ రెడ్డి, కోడలు, హిరణ్మయిరెడ్డి, కూతురు మనోవిద్యారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఎమ్మెల్యే అభ్యర్థి సాయిప్రసాద్‌రెడ్డికి ఒక ఓటు, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యకు మరో ఓటు ఫ్యాన్ గుర్తుపై వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోలకల్ రేణుక, లింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్ మంజుల, పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవా తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి నగర్‌లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న హిరణ్మయిరెడ్డి



సలకలకొండలో వైఎస్సార్‌సీపీ జెండాలను చేతబూని చిందులు వేస్తూ ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న అభిమానులు



హనుమాపురంలో ఓటు వేయాలని కోరుతున్న వై.ప్రదీప్‌రెడ్డి

బాలనాగిరెడ్డిని గెలిపించుకుందాం

పెద్దకడబూరు: ఫ్యాన్ గుర్తుపై ఓటేసి బాలనాగిరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని వైఎస్సార్ సీపీ యూత్ కమిటీ రాష్ట్ర సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని హనుమాపురం, రాగిమాన్‌దొడ్డి గ్రామాల్లో సర్పంచ్‌లు పూజారి ఇందిరమ్మ, చంద్రకళ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందించి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ కమిటీ సభ్యుడు విజయేంద్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రవిచంద్రరెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె శివన్న, నాయకులు గజేంద్రరెడ్డి, శివారెడ్డి, నవీన్‌రెడ్డి, ముక్కరన్న, అర్లప్ప, పూజారి ఈరన్న, పెద్దయ్య, వెంకప్పస్వామి పాల్గొన్నారు.

కోసిగి: వైఎస్సార్ సీపీ నాయకులు ఎంపీపీ ఈరన్న, గానిగ వీరస్వామి, ముకుంద కృష్ణమూర్తి, కొరివి నాగరాజు, కట్టెల నరసింహులు గురువారం కోసిగిలోని గ్రామీణ బ్యాంక్, కుమ్మరి వీధి, ఊరువాకిలి, సిద్ధప్ప పాళెం కాలనీలలో ఇంటింటా ప్రచారం చేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. వై.బాలనాగిరెడ్డి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి కోసిగి మండలాన్ని అభివృద్ధి చేశారన్నారు. మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు చిన్న తిమ్మయ్య, కపటి లక్ష్మన్న, కామలదొడ్డి వీరేష్, చిన్న వీరస్వామి, నాగేంద్ర, లక్ష్మయ్య, అంజి, చిన్న కోసిగయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.



కోసిగిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అనూషరెడ్డి అభ్యర్థన



ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్న కుమారిరెడ్డి

కౌతాళం: మండలంలోని చూడి, ఎరిగేరి, తోవి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, సర్పంచ్‌లు లక్ష్మి, గోవిందు, నర్సమ్మ, కుమారిరెడ్డి, అనూషరెడ్డి ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డిని గెలిపించుకుని మండలాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కో ఆప్షన్ మెంబర్ మహబూబ్ సాబ్, ఎంపీటీసీలు, నాయకులు రమేష్, దాట్ల సుబ్బారాజు, రాఘవేంద్రరెడ్డి, వడ్డె రాము, నర్సప్ప, అబ్దుల్‌సమద్, భీమేష్, అనిల్‌కుమార్, నీలకంఠరెడ్డి, ఉప్పలప్ప, వీరేష్, సోమిరెడ్డి, సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

రమణీయం.. మల్లికార్జునుడి రథోత్సవం



అశేష భక్తజనం మధ్య సాగుతున్న రథోత్సవం



పూజలందుకుంటున్న మల్లికార్జునస్వామి

కౌతాళం: మండల పరిదిలోని బదినేహాల్ గ్రామంలో వెలసిన మల్లికార్జున స్వామి రథోత్సవం రమణీయంగా సాగింది. జాతర సందర్భంగా గురువారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి తెల్లవారుజామునే ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన అమ్మిరెడ్డి వంశీయుల కుటుంబం మొదటి కుంభం ఆలయానికి చేరి రథానికి పూజలు చేసిన అనంతరం గ్రామస్తులు రథాన్ని ముందుకు లాగారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రథోత్సవంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, బదినేహాల్ సింగల్‌విండో అధ్యక్షుడు అత్రితనయగౌడ్, సీనియర్ నాయకుడు వీరభద్రగౌడ్, నరేష్ రెడ్డి, ఉప సర్పంచ్ ప్రసన్న గౌడ్‌లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

పెద్దకడబూరు: సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ శ్రీవిద్య అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్య, విద్యుత్ సరఫరా, ఉపాధిహామీ పథకాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీవిద్య మాట్లాడుతూ ఉన్నతాధికారుల అనుమతితో సమావేశం ఏర్పాటు చేసుకున్నామన్నారు. కొత్త పనులు చేపట్టకుండా చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ ముత్తమ్మ, కో–ఆప్షన్ సభ్యుడు షేర్‌ఖాన్‌పటేల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్, హౌసింగ్ ఏఈ వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శిలు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

విజేత పీఆర్ పల్లె వృషభాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో శ్రీరామనవమి పురస్కరించుకుని గురువారం నిర్వహించిన సీనియర్ కేటగిరీ వృషభాల బండలాగుడు పందెంలో నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పీఆర్ పల్లెకు చెందిన నాగయ్య వృషభాలు రాతి దూళాన్ని నిర్ణీత సమయంలో 3,217 అడుగుల దూరం లాగి విజేతలుగా నిలిచి రూ.40 వేల బహుమతి గెలుచుకున్నాయి. తర్వాతి మూడు స్థానాలలో వరుసగా డోన్ మండలం సీసంగుంతలకు చెందిన మోహన్ రెడ్డి వృషభాలు, అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కృష్ణాపురం నాగేశ్వరరెడ్డి వృషభాలు, బేతంచెర్ల వెంకట్రాముడు వృషభాలు నిలిచి వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు గెలుచుకున్నాయి. విజేతలకు దాతలు, గ్రామ పెద్దలు బహుమతులను అందజేశారు.

తుగ్గలి: శ్రీరామనవమి సందర్భంగా గురువారం సాయంత్రం తుగ్గలిలో నిర్వహించిన దేశవు ఎద్దుల రాతి దూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్ రెడ్డి, చంద్రశేఖర రెడ్డి ప్రారంభించారు. పోటీలలో బాలతిమ్మయ్య వృషభాలు విజేతగా నిలవగా తర్వాతి స్థానంలో జయచంద్ర, ధర్మరాజు వృషభాలు సమానంగా నిలిచాయి. విజేత వృషభాల యజమానులకు వైఎస్సార్‌సీపీ నాయకులు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గిరిగెట్ల విష్ణువర్ధనరెడ్డి, రూ.10 వేలు, రూ.5 వేలు ,రూ.3 వేలు నగదు బహుమతులు అందజేశారు.

22 నుంచి సుంకులమ్మ బ్రహ్మోత్సవాలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురం గ్రామదేవత సుంకులా పరమేశ్వరీదేవి బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి రోజు ప్రభోత్సవం నిర్వహిస్తారు. రెండోరోజు 23వ తేదీ రథోత్సవం జరుగుతుంది. ఈ నేపథ్యంలో గురువారం ఆయకట్టుదారులు, మేటీలతో స్థానిక ఆంజనేయస్వామి గుడి వద్ద ఆలయ కార్యనిర్వహణాధికారి నరసయ్య సమావేశమయ్యారు. ఉత్సవాల నిర్వహణపై సమీక్షించారు. ఎన్నికల కోడ్ కారణంగా క్రీడా పోటీలు నిర్వహించడం లేదన్నారు. ఇందుకు పోలీసులు, దేవదాయశాఖ అధికారులు అనుమతించడం లేదన్నారు. ప్రభోత్సవం, రథోత్సవం కార్యక్రమాన్ని కలిసికట్టుగా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వారికి తాంబూళాలు అందజేశారు.

రథానికి ప్రత్యేక పూజలు

సుంకులాపరమేశ్వరీదేవి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం రథశాల నుంచి రథాన్ని భక్తులు బయటకు తీసుకొచ్చారు. ఆలయ చైర్మన్ ఉమామహేశ్వరమ్మ, కార్యనిర్వహణాధికారి నరసయ్య ఆధ్వర్యంలో భక్తులు రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మార్మోగిన శ్రీరామ నామం

- కనుల పండువగా సీతారామాంజనేయ రథోత్సవం



హెచ్.మురవణి గ్రామంలో భక్తుల మధ్య రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో సీతారామాంజనేయ స్వామి

పెద్దకడబూరు: మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో శ్రీరామ నామం మార్మోగింది. ఉదయం ఆలయ అర్చకులు స్వాములవారికి కుంకుమార్చన, అష్టోత్తర శతనామావళి, పుష్పాభిషేకం, పాలాభిషేకం, పంచామృతాభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళహారతులు ఇచ్చారు. అనంతరం గ్రామ ప్రజలు పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం రథం ముందు శాంతి హోమం చేపట్టారు. అనంతరం కిందిగేరి వేమారెడ్డి ఇంటి నుంచి కలశాలు, పైగేరి ఓంకారప్ప ఇంటి నుంచి కుంభాన్ని ఊరేగింపుగా రథం వద్దకు తెచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులను చేసి అశేష భక్తజనుల మధ్య శ్రీరామ నామంతో ముందుకులాగారు. రథోత్సవం బసవన్న గుడి కట్టవరకు సాగింది. అనంతరం తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఎస్‌ఐ మహేష్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న కౌతాళం ఎస్‌ఐ



మద్యం బాటిళ్లను చూపుతున్న మంత్రాలయం ఎస్‌ఐ గోపినాథ్

కౌతాళం: మండల పరిధిలోని బాపురం చెక్‌పోస్టు సమీపంలో అక్రమంగా తరలుతున్న కర్ణాటక మద్యాన్ని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. కర్ణాటక రాష్ట్రం మాన్వికి చెందిన రంగా, కోసిగి మండలం కడిదొడ్డి గ్రామానికి చెందిన బొజ్జయ్యలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 16 బాక్స్‌ల టెట్రా ప్యాకెట్లను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సోదాల్లో సిబ్బంది వీరాంజి, నరేంద్ర, మద్దిలేటి, వీరభాస్కర్, రామాంజి, మధు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం..

మంత్రాలయం: స్థానిక రామచంద్ర నగర్ కాలనీకి చెందిన ఈడిగ జయరాము, తెలంగాణ రాష్ట్రం అయిజకు చెందిన జగన్నాథం తరలిస్తున్న తెలంగాణ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ గోపినాథ్ తెలిపారు. గురువారం దాడులు నిర్వహించగా వారి వద్ద నుంచి 144 మాంచనాస్ (180ఎంఎల్), 44 రాయల్ స్టాగ్ (180ఎంఎల్),44 ఎంసీ (180ఎంఎల్) బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి, రిమాండ్ తరలించామన్నారు.



ఎంపీడీఓ మునెప్పకు రాజీనామాలు సమర్పిస్తున్న రచ్చమర్రి వలంటీర్లు

వలంటీర్ల రాజీనామా



రాజీనామాలు సమర్పిస్తున్న కాచాపురం సచివాలయం వలంటీర్లు



రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు సమర్పిస్తున్న దృశ్యం

మంత్రాలయం: మండల పరిధిలో 53 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రచ్చమర్రి –1,2 సచివాలయాల పరిధిలో 27 మంది, కాచాపురం సచివాలయం –1, 2లో 18 మంది, మాధవరంలో 8 మంది వలంటీర్లు రాజానామా పత్రాలను ఎంపీడీవో మునెప్పకు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ తమను ఎన్నికల విధుల నుంచి తప్పించడంతో మనస్తాపంతో రాజీనామా చేస్తున్నామన్నారు.

→ **కౌతాళం:** మండలంలోని 16 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. కాత్రికి గ్రామానికి చెందిన ఏడుగురు, పొదలకుంట గ్రామానికి చెందిన ఐదుగురు, అగసలదిన్నె గ్రామానికి చెందిన నలుగురు వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ రఘునాథ్ గుప్తా తెలిపారు.

→ **ఆదోని టౌన్:** పట్టణానికి చెందిన 8 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా ప్రత్రాలను వార్డు అడ్మిన్‌లకు అందజేశారు. వాటి ఆమోదం కోసం మున్సిపల్ కమిషనర్‌కు సిఫారసు చేసినట్లు అడ్మిన్‌లు తెలిపారు. 8 మంది వలంటీర్ల రాజీనామాలు ఆమోదం కోసం జిల్లా ఉన్నతాధికారులకు పంపినట్లు మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు.

→ **ఆదోని రూరల్:** మండలంలోని బసరకోడు, దొడ్డనకేరి, గణేకల్, సాదాపురం గ్రామాల్లోని వార్డు, సచివాలయ వలంటీర్లు 15 మంది గురువారం రాజీనామా చేశారు. వారి రాజీనామా ప్రతులను ఎంపీడీఓ విజయశేఖర్‌రావుకు అందజేశారు.

నేటి నుంచి జిల్లాలో షర్మిల న్యాయయాత్ర

కర్నూలు(సెంట్రల్): ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మూడు రోజులపాటు జిల్లాలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.బాబురావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నుంచి 18వ తేదీ రాత్రి ఆలూరుకు చేరుకొని అక్కడే బస చేస్తారని, 19వ తేదీ ఉదయం ఆలూరులో కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు ఆదోనిలో, 6 గంటలకు ఎమ్మిగనూరులో జరిగే కార్నర్ మీటింగ్‌లలో ఆమె పాల్గొంటారన్నారు. అనంతరం కడపకు వెళ్లిపోతారని, 20న ఉదయం కడప పార్లమెంట్ స్థానానికి నామినేషన్ వేసి సాయంత్రం 6 గంటలకు కోడుమూరులో జరిగే సభకు హాజరవుతారన్నారు. అక్కడి నుంచి రాత్రి కర్నూలు చేరుకొని 21న నగరంలో ర్యాలీ, అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారన్నారు.